క్లుప్తంగా

'భౌ'బోయ్ కుక్కలు



భోగాపురం రహదారిపై గుంపులు గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

భోగాపురం: మండల కేంద్రంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కలు..జనాలను భయపెట్టిస్తున్నాయి. కొన్నిచోట్ల గుంపులుగుంపులుగా తిరిగే వీధికుక్కలు దారిన పోయే వారిపై ఎగబడి కరుస్తున్నాయి. వాహనాలపై వచ్చినా తమపై ఎగిరిపడిపోతున్నాయని పలువురు వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కుక్కకాటు బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి, వీధికుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సన్మానం



ప్రసాదరావును సన్మానిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ పద్మజ, తదితరులు

విజయనగరంఫోర్ట్: స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రేడియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ప్రసాదరావుకు ప్రొఫెసర్‌గా పదోన్నతి లభించి..రాజమండ్రి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి బదిలీ అయింది. ఈ మేరకు ఆయనను ఆస్పత్రిలోని సిబ్బంది ఆదివారం సన్మానించారు. అనంతరం ఆయన సేవలను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ, తదితరులు ప్రశంసించారు. కార్యక్రమంలో ఆర్ఎంవో కామేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

'వాక్ ఫర్ ది బుక్'



కార్యక్రమంలో పాల్గొన్న సాహితీవేత్తలు, తదితరులు

విజయనగరం టౌన్: ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం పురస్కరించుకుని, స్థానిక మహాకవి గురజాడ స్వగృహం వద్ద 'వాక్ ఫర్ ది బుక్' అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. విజయనగరం రీడ్స్, విద్యలనగరి చిల్డ్రన్‌బుక్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్ఞాన సముపార్జనలో పుస్తకాల ప్రాధాన్యాన్ని వక్తలు వివరించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు రేపల్లె ఈశ్వరరావు, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ మహేష్

డెంకాడ: విద్యార్థులంతా పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని, పుస్తకాలు చదవడం ద్వారా అపారమైన విజ్ఞానం లభిస్తుందని లైబ్రేరియన్ వై.మహేష్ అన్నారు. మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా గ్రంథాలయానికి వచ్చి, ఇందులోని రకరకాల పుస్తకాలు చదివి జ్ఞానం సంపాదించుకోవాలన్నారు. ఎంతోమంది నిరుద్యోగులు ఇక్కడి పుస్తకాలు చదువుకుని ఉద్యోగాలు సాధించారన్నారు.

నానో యూరియానే వాడండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నెల్లిమర్ల రూరల్: రైతులంతా పంటలకు నానో యూరియానే వాడాలని మండల ప్రత్యేకాధికారి మురళీమోహన్, ఎంపీడీవో రామకృష్ణ రాజు, ఏడీఏ కోటేశ్వరరావులు సూచించారు. మండలంలోని కొండగుంపాం, మొయిద గ్రామాల్లోని రైతులకు ఎరువుల వినియోగంపై ఆదివారం అవగాహన కల్పించారు. నానో యూరియాను వాడడం వల్ల ఎరువులపై ఇదివరకు పెట్టే ఖర్చును తగ్గించుకోవచ్చని తెలిపారు. అలాగే నానో యూరియా వల్ల నేల సారవంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు నాగరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చిరుతిళ్లు..ఆరోగ్యానికి చేటు!

- నాసిరకంగా చిరుతిళ్లు, జంక్‌ఫుడ్స్
- చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



తినకూడని చిరుతిళ్లు కొన్నింటిని ఈ దుకాణంలో చూడొచ్చు..

భోగాపురం: ఒకప్పుడు చిరుతిళ్లు అంటే సంవత్సరంలో ఏదో ప్రత్యేకమైన పండగ రోజుల్లో చేసుకునే జంతికలు, చేగోడియాలు, సున్నుండలు ఇలాంటివి గుర్తొస్తాయి. అవి ఇంట్లో మన చేతులమీదుగా తయారు చేసుకుంటాం కాబట్టి అవి ఆరోగ్యానికి మంచివి. ప్రస్తుత కాలంలో మాత్రం చిరుతిళ్లు అంటే ప్యాకెట్ల రూపంలో దొరికే నాసిరకం చిప్స్, రకరకాల మసాలాలు, టేస్టింగ్ సాల్ట్, ఫుడ్ కలర్‌తో చేసే ఆహార పదార్థాలు. ఇవి కంటికి అందంగా పంటికి రుచికరంగా ఉన్నా అవి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి. నాసిరకంగా అవి ఉండడం వల్ల మానవ శరీరంలోని వివిధ అవయవాలను దెబ్బతీస్తాయి. ముఖ్యంగా ప్రజల్లో చైతన్యం లేకపోవడంతో పాటు అధికారుల పర్యవేక్షణ కూడా కొరవడడంతో వాటి అమ్మకాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చిన్నారులే అధికంగా..

మార్కెట్‌లోకి వచ్చే కొత్తరకం చిరుతిళ్లను తినేందుకు చిన్నారులు అధికంగా ఇష్టపడుతుంటారు. పెద్దలు కూడా వారి ఇష్టం కాదనకుండా కొనేసి ఇచ్చేస్తున్నారు. అయితే వాటిలో నాణ్యత లేని పదార్థాలు తినడం వల్ల చిన్నారులు త్వరగా అనారోగ్యానికి గురవుతున్నారు. ప్రధానంగా చిన్నచిన్న కిరాణా షాపులు, వీధి వ్యాపారుల వద్ద కొనుగోలు చేసేవి నాణ్యత లేనివిగా ఉంటున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బ్రాండెడ్ కానివి..

కొన్ని బ్రాండెడ్ పదార్థాలు విక్రయించే కంపెనీ అక్షరాల్లోని రెండు, మూడు అక్షరాలు మార్చేసి అదే లోగో, లెటరింగ్, ఫాంట్‌సైజ్‌తో కొంతమంది అక్రమ వ్యాపారులు తిరుతిళ్ల ప్యాకెట్లు తయారు చేసి, విక్రయిస్తున్నారు. అది బ్రాండెడ్ అనుకుని చదువురాని ఎంతోమంది వాటిని కొనుగోలు చేసి తింటున్నారు. ఇలాంటివి నియోజకవర్గ వ్యాప్తంగా చిన్నచిన్న దుకాణాలకు సరఫరా అవ్వడమే కాకుండా శరవేగంగా అమ్ముడుపోతున్నాయి. విజయనగరం, తగరపువలస, భోగాపురం, పూసపాటిరేగ నుంచి ఒక్కో హోల్‌సేల్ వ్యాపారి నెలకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు తినుబండారాలు తీసుకురావడానికి వెచ్చిస్తున్నారు.

ప్యాకెట్‌కు రెట్టింపు కమీషన్..

బ్రాండెడ్ కంపెనీ వారి తినుబండారాలు అమ్మితే ఒక ప్యాకెట్‌పై 50 పైసలు మాత్రమే కమీషన్ వస్తుంది. అదే లోకల్‌లో తయారు చేసే అన్‌బ్రాండెడ్ తినుబండారాలు విక్రయిస్తే ప్యాకెట్‌పై రూపాయి కమీషన్ వస్తుంది. ఇలా మంచి కంపెనీకి చెందినవి 12 తినుబండారాల ప్యాకెట్లు అమ్మితే వాటిపై కేవలం రూ.6లే వస్తుంది. అదే నాసిరకంవి 12 ప్యాకెట్లు అమ్మితే రూ.12 వస్తాయి. ఈ లెక్కన కొని తినేవాడి ఆరోగ్యమే కదా నా సొమ్ము ఏం పోయిందనే రీతిలో వ్యాపారులు వ్యవహరిస్తున్నారు. నాసిరకానికి చెందిన చిరుతిళ్లు కొనేసి విచ్చలవిడిగా అమ్మేస్తున్నారు.

తనిఖీలు నామమాత్రం..

విచ్చలవిడిగా అమ్ముతున్న నాసిరకం తినుబండారాలను అరికట్టేందుకు అధికారుల తనిఖీలు నామమాత్రంగా ఉన్నాయి. ఆహార తనిఖీలు, పంచాయతీ, తూనికలు, కొలతల శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెలువడుతున్నాయి. బాగా కనిపించడం కోసం, రుచికి చాలా రకాల చిరుతిళ్లల్లో ఆరోగ్యానికి హానికరమైన రసాయనాలు వాడుతున్నారు. అలాంటివి తింటే ఆరోగ్యం పోతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

జంక్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి..



చిరుతిండ్లు, జంక్‌ఫుడ్స్‌కు అందరూ దూరంగా ఉండాలి. రుచి, ఎక్కువ కాలం నిల్వకు రంగులు, రసాయనాలు వాడే పదార్థాలు తింటే కడుపునొప్పి, అజీర్తి వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇదే కొనసాగితే ఎసిడిటీ, జీర్ణకోశం, పేగు సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది.

–కోట మనస్వి, వైద్యాధికారి, పోలిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

వైద్య శిబిరాన్ని పరిశీలించిన డీఎంహెచ్‌వో



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జీవనరాణి

భోగాపురం: మండలంలోని చినకవులవాడలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌వో జీవనరాణి ఆదివారం పరిశీలించి, అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. శిబిరానికి వచ్చే ప్రతి రోగికి సక్రమంగా తనిఖీలు చేసి అవసరమైన మందులు సకాలంలో అందజేయాలన్నారు. గ్రామానికి చెందిన ఓ మహిళ ఇటీవల డెంగీ వ్యాధితో మృతి చెందగా ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు గ్రామీణులెవరూ దోమల బారినపడకుండా, దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో వైద్యారోగ్య సిబ్బందికి తెలిపారు. ఫీవర్ సర్వే చేసి జ్వర పీడితులను గుర్తించాలని, వారికి సకాలంలో వైద్యం అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఎంవో మణి, డీఎస్‌వో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ ఓటరు జాబితా ప్రచురించాలి



పోస్టుకార్డులు చూపిస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకుడు గణేష్, తదితరులు

విజయనగరంఫోర్ట్: డిజిటల్ ఓటరు జాబితాను వెంటనే ప్రచురించాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సుంకరి గణేష్ డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీకి మద్దతుగా స్థానిక పట్టణంలో పోస్టుకార్డు ఉద్యమం ఆదివారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ నకిలీ ఓటర్ల ద్వారా జరుగుతున్న ఓటు చోరీని అరికట్టడానికి తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఓటుహక్కు అనేది ప్రజాస్వామ్యంలో అత్యంత పవిత్రమైనదని, కానీ నకిలీ ఓటర్ల ద్వారా ఓటు చోరీ జరిగి ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీయడం జరుగుతోందని ఆరోపించారు. ఇప్పటికైనా ఓటు చోరీ జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సాయి, చందు, మహేష్, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల ర్యాలీ

విజయనగరం క్రైమ్: నగరంలో ముస్లిం సోదరులు ఆదివారం ర్యాలీ చేపట్టారు. మిలాద్ ఉన్ నబీ పురస్కరించుకుని, చంద్రగ్రహణం రోజున మహ్మద్ ప్రవక్త చంద్రుడిని చీల్చుకుంటూ జన్మించాడని ప్రతీతి కాగా ఈ సందర్భంగా వారంతా ర్యాలీ చేపట్టినట్లు సమాచారం. భారీ పోలీస్ బందోబస్తు నడుమ నగరంలోని మస్తాన్ వీధి దగ్గర నుంచి మూడులాంతర్లు, కోటదర్గా, గంటీ మీదుగా మస్తాన్ వీధి వరకు ఈ ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో వన్‌టౌన్, టూటౌన్ ట్రాఫిక్ సీఐలు చౌదరి, శ్రీనివాస్, సూరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులకు అధికారులు సహకరించడం బాధాకరం

- ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ప్రతినిధులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: చెరువులను పరిరక్షించాల్సిన అధికారులే కబ్జాదారులకు సహకరించడం బాధాకరమని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మరిశర్ల మాలతీకృష్ణమూర్తినాయుడు, గౌరవాధ్యక్షుడు భారతానంద స్వామీజి అన్నారు. మండలంలోని తంగుడుబిల్లి కాలనీ వద్ద వివాదాస్పద చెరువును ఆయన ఆదివారం పరిశీలించి, గ్రామస్తులకు సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ అధికారులే అక్రమార్కులకు సహకరించడం నేరమని, కబ్జాదారులకు కొమ్ముకాస్తున్న అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామస్తుల ఆవేదనను పరిగణలోకి తీసుకుని, చెరువును కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో కషాయాల పిచికారీ లాభదాయకం



డ్రోన్‌తో కషాయాల పిచికారీపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌టీఎల్ ప్రకాష్, తదితరులు

శృంగవరపుకోట: డ్రోన్‌తో కషాయాల పిచికారీ రైతాంగానికి చాలా లాభదాయకమని ఆర్‌టీఎల్ ప్రకాష్ తెలిపారు. మండలంలోని సంతగవిరమ్మపేట, వినాయకపల్లి గ్రామాల్లో డ్రోన్ పిచికారీపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆధునిక పద్ధతులు అవలంభించాలన్నారు. డ్రోన్‌తో పిచికారీ వల్ల డబ్బు, సమయం ఆదా అవుతాయని చెప్పారు. అవసరమైన కషాయాలు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వద్ద సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

వితరణ



మైక్రోస్కోప్ అందజేస్తున్న ఐడీబీఐ అధికారులు

విజయనగరం: నగరంలోని మూడు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలకు ఐడీబీఐ బ్యాంకు యాజమాన్యం మైక్రోస్కోప్‌లు, ఫ్యాన్లు, లైట్లు ఆదివారం వితరణ చేశారు. మొత్తం రూ.1.75 లక్షల వ్యయంతో కొనుగోలు చేసి, కంటోన్మెంట్ పాఠశాలకు 50 లైట్లు, 25 ఫ్యాన్లు, బీపీఎం స్కూల్‌కు 25 ఫ్యాన్లు, మరో 25 లైట్లు, ఓ మైక్రోస్కోప్‌ను అందజేశారు. మరో పాఠశాలకు కూడా ఫ్యాన్లు, లైట్లు అందించారు. ఈ మేరకు బ్యాంకు అధికారులకు కమిషనర్ నల్లనయ్య కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

విజయనగరం టౌన్: స్థానిక ఎస్‌వీఎన్ హోటల్‌లో విద్యార్థులకు క్విజ్ పోటీలు ఆదివారం నిర్వహించారు. విజయనగరం రోటరీ సెంట్రల్ క్లబ్ వారు నిర్వహిస్తున్న నవతరోత్సవాల్లో భాగంగా చేపట్టిన ఈ పోటీలకు పట్టణంలోని 18 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం క్విజ్ పోటీల విజేతలను ప్రకటించారు. వారికి త్వరలో బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ సెంట్రల్ క్లబ్ అధ్యక్షుడు విజయ కుమార్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన తగదు

శృంగవరపుకోట: యూరియా సరఫరాపై ఎలాంటి ఆందోళనలు వద్దంటూ మండల వ్యవసాయాధికారి కె.రవీంద్ర అన్నారు. మండలంలోని సంతగవిరమ్మపేట, గోపాలపల్లి, సీతారాంపురం గ్రామాల్లో ఆదివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మండలంలో 48 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని తెలిపారు. ఎస్.కోట, పెదఖండేపల్లి, మూలబొడ్డవర గ్రామాల్లో సోమవారం నుంచి యూరియా విక్రయిస్తామన్నారు.

వివాదాస్పదంగా మారిన శ్మశానవాటిక

- రెండు గ్రామాల మధ్య చెలరేగిన చిచ్చు



పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న తమ్మన్నమెరక గ్రామస్తులు

కొత్తవలస: మండలంలోని అప్పన్నదొరపాలెం పంచాయతీ పరిధి తమ్మన్నమెరక, జోడిమెరక గ్రామాల మధ్య శ్మశానవాటిక చిచ్చు రేగింది. మా గ్రామ పరిధిలో దహనసంస్కారాలు చేయొద్దని ఒక వర్గం అంటే.. అలా ఎలా కుదురుతుందని మరోవర్గం పట్టుబట్టింది. వివరాల్లోకి వెళితే.. రెల్లి రెవెన్యూ పరిధిలో అప్పన్నదొరపాలెం పంచాయతీ ఉంది. ఈ పంచాయతీ పరిధిలో తమ్మన్నమెరక, జోడిమెరక గ్రామాలున్నాయి. అయితే జోడిమెరక గ్రామానికి చెందిన శ్మశానవాటిక సర్వే నంబర్ 11లో సుమారు 4.94 ఎకరాల్లో ఉంది. ఈ శ్మశానాన్ని కొంతమంది రియల్టర్లు ఆక్రమించుకుని ప్లాట్లు వేసుకుని అమ్మేశారు. దీంతో జోడిమెరక గ్రామంలో ఎవరైనా చనిపోతే చెంతనే గల తమ్మన్నమెరక గ్రామానికి చెందిన శ్మశానవాటికలో దహన సంస్కారాలు చేస్తున్నారు. జోడిమెరక వాసులు తమ శ్మశానాన్ని వినియోగించుకోవడంపై తమ్మన్నమెరక వాసులు అడ్డు చెప్పారు. నాలుగు రోజుల కిందట జోడిమెరక గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మృతి చెందగా దహన సంస్కారాల కోసం తమ్మన్నమెరక శ్మశానికి తీసుకురాగా గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో రెవెన్యూ, పంచాయతీ అధికారులు చొరవ తీసుకొని దహన సంస్కారాలు పూర్తి చేశారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించుకుందామని భావించి అప్పన్నదొరపాలెం పంచాయతీ కార్యాలయం వద్దకు సర్పంచ్ జోడి రాములమ్మ, గ్రామస్తులు ఆదివారం రావాలని జోడిమెరక వాసులను తమ్మన్నమెరక పెద్దలు సూచించారు. అనుకున్న సమయానికి తమ్మన్నమెరక గ్రామస్తులు అప్పన్నదొరపాలెం పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకున్నా.. జోడిమెరక గ్రామస్తులు రాలేదు. దీంతో సహనం కోల్పోయిన తమ్మన్నమెరక వాసులు తమ గ్రామంలోని శ్మశాన వాటికను వినియోగిస్తే ఒప్పుకునేది లేదని స్పష్టం చేస్తూ అక్కడ నుంచి వెనుదిరిగారు. దీంతో ఈ వ్యవహారం ఎటు పోతుందోనని రెండు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



భక్తుల రాకపోకలు కనిపించని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం

● గ్రహణం ఎఫెక్ట్..

చంద్రగ్రహణం కారణంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ఆలయాలను మూసివేశారు. దీంతో భక్తుల రాకపోకలు లేక మందిరాలు బోసిపోయాయి. గ్రహణం వీడిన తర్వాత ఆలయాల శుద్ధి, సంప్రోక్షణ పూజల అనంతరం భక్తులకు పునః దర్శనం కల్పిస్తారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



మూసివేసిన వేంకటేశ్వరస్వామి ఆలయం



బోసిపోయిన ఎల్లమ్మ దేవాలయం



గ్రహణం కారణంగా మూసివేసిన షిర్డీసాయిబాబా మందిరం

చండీహోమం



విజయనగరంలోని పైడితల్లి చదురుగుడి వద్ద చండీహోమం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఈ హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

దగాకోరు ప్రభుత్వంలో రైతుకు అన్యాయం



పార్టీ నాయకులతో కలిసి అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో అన్నదాతకు అన్యాయం జరుగుతోందని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆరోపించారు. ప్రభుత్వం తీరుకు నిరసనగా ఈ నెల 9న ఆర్డీఓ కార్యాలయం వద్ద అన్నదాత పోరు పేరిట ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ మేరకు కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను అర్థాన్నపాలెం సమీపంలో గల క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు సమస్యలపై ప్రభుత్వం మొద్దునిద్ర నటిస్తోందన్నారు. రైతులకు యూరియా అందించలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. ఎరువులను బ్లాక్‌మార్కెట్‌లో కూటమి నాయకులు విక్రయించుకుంటూ కోట్లు కూడబెట్టుకుంటున్నారని ఆరోపించారు. గతంలో ఇటువంటి పరిస్థితి లేదన్నారు. రైతు ఇంటివద్దే ఎరువులు, విత్తనాలు అందించామని చెప్పారు. అన్నదాతపోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎల్.కోట ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, కొత్తవలస మాజీ ఎంపీపీ గొరపల్లి శివ, లక్కవరపుకోట, కొత్తవలస, వేపాడ, జామి మండలాల పార్టీ అధ్యక్షులు గుమ్మడి సత్యనారాయణ, ఒబ్బి నాయుడు, ముమ్మలూరు జగన్నాథం, గొర్లె రవికుమార్, ఎస్.కోట వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, సర్పంచ్ పీతల కృష్ణ, పార్టీ నాయకులు బొంతల వెంకటరావు, పల్లా భీష్మ, మదీన అప్పలరమణ, యడ్ల కిశోర్, తూర్పాటి అప్పలరాజు, బీఏ నాయుడు, పెనగంటి చెల్లయ్య, మాధవరావు, లెంక వెంకన్నపాల్గొన్నారు.